# సైదాబాద్‌కు మినీ ఎయిర్‌టెక్‌ వాహనాన్ని కేటాయించండి



వాటర్‌వర్క్స్‌ జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్‌: డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం సైదాబాద్‌ డివిజన్‌కు ప్రత్యేకంగా మినీ ఎయిర్‌టెక్‌ వాహనాన్ని కేటాయించాలని కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఆస్మాన్‌ఘడ్‌ జలమండలి జీఎం శ్యాం సుందర్‌ నాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆస్మాన్‌ఘడ్‌ జలమండలిలో సైదాబాద్‌ డివిజన్‌ను అక్బర్‌బాగ్‌ నుంచి వేరు చేసి ప్రత్యేక సెక్షన్‌గా ఏర్పాటు చేసిన తరువాత సైదాబాద్‌కు ప్రత్యేకంగా ఎయిర్‌టెక్‌ వాహనాన్ని కేటాయించలేదని తెలిపారు. దీంతో డివిజన్‌ పరిధిలో నిత్యం ఎక్కడో ఒకచోట డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యను పరిష్కరించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆమె వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైదాబాద్‌కు మినీ ఎయిర్‌టెక్‌ వాహనాన్ని కేటాయించాలని ఆమె కోరారు.

# మృతుల కుటుంబీకులకు ఎంపీ ఈటల పరామర్శ



మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌

నాగోలు: వారం క్రితం ఎల్‌బీనగర్‌ ఆర్టీసీ కాలనీ, పరిసర ప్రాంతాలలో నివాసం ఉండే యువకులు భూదన్‌ పోచంపల్లి వెళ్తుండగా కారు అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 5 మంది మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ మృతుల కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతులు అక్షయ్‌చారి, హర్ష, వంశీగౌడ్‌, విగ్నేష్‌గౌడ్‌, వినయ్‌ చిత్రపటాలకు ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్‌ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌ కుమార్‌, నాయకులు ధీరజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



హస్తినాపురం డివిజన్‌లో పర్యటించి కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ సుజాతనాయక్‌

హస్తినాపురం: డివిజన్‌ పరిధిలోని వివిధ ప్రాంతాలలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభిచాలని హస్తినాపురం కార్పొరేటర్‌ బానోతు సుజాతనాయక్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని వివిధ ప్రాంతాలలో మంజూరైన పనులను సత్వరమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన అధికారులతో కలిసి శుక్రవారం సుజాతనాయక్‌ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పనులు త్వరగా పూర్తవుతాయని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కూడా మెరుగు పడతాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌళిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాస్‌, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల



జీవశ్రీ ఆయుర్వేద క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల

సైదాబాద్‌: చికిత్స కోసం వచ్చే రోగులకు వైద్యులు వారికి అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అన్నారు. శుక్రవారం మలక్‌పేటలో జీవశ్రీ ఆయుర్వేదిక్‌ సంస్థ వారి ఆరో క్లినిక్‌ను ఆయన సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కొంటే ఫణిశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో తమ సేవలు అందించడానికి జీవశ్రీ ఆయుర్వేదిక్‌ సంస్థ వారు తమ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఎండీ కొంటే ఫణిశ్రీ మాట్లాడుతూ.. మహిళా వైద్య నిపుణురాలు డాక్టర్‌ సునీత గ్రేస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్లినిక్‌లో మహిళలకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. పైల్స్‌, ఫిస్టులా వంటి మహిళలు బయటకు చెప్పుకోలేని గుప్తా రోగాలకు ప్రత్యేకంగా మెరుగైన చికిత్సలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్‌ దత్తకుమార్‌, డాక్టర్‌ కల్పన, డాక్టర్‌ సత్యదీప, డాక్టర్‌ సుష్మిత, మల్లికార్జున్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం అందరి సామాజిక బాధ్యత



భూలక్ష్మీ దేవాలయ పరిసరాల్లో మొక్కలు నాటిన కార్పొరేటర్‌ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్‌: నిత్య జీవనంలో తరచూ మొక్కలు నాటడం మనందరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఐఎస్‌సదన్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేటర్‌ హార్టికల్చర్‌ అధికారులు, కాలనీవాసులతో కలిసి డివిజన్‌ పరిధిలోని భూలక్ష్మీ దేవాలయం, గోశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నాటిన మొక్కలు చక్కగా ఎదిగేలా తప్పనిసరిగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్‌ డిపార్ట్‌మెంట్‌ డీడీ అమీనా బేగం, మేనేజర్‌ యమున, హెచ్‌ఏ సుష్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, అరవింద్‌, జగన్‌, రేఖ, లక్ష్మి, రాజు, రఘు, కార్తీక్‌, మధు, రవి పాల్గొన్నారు.

# అరకొర జీతాలతో దుర్భర జీవితం

- ఇంటిల్లిపాదిని వదిలి తెల్లవారుజామునే పనికి
- డబుల్‌ డ్యూటీలు చేయించుకుంటున్నారని ఆవేదన
- చలి కాలంతో తప్పని తిప్పలు
- గోడు వెళ్లబోసుకున్న పారిశుద్ధ్య కార్మికులు
- సైదాబాద్‌లో మీతో సాక్షితో కార్మికుల ఆవేదన



సైదాబాద్‌లో మీతో సాక్షి ప్రతినిధితో మాట్లాడుతున్న కార్మికులు



తమ గోడు తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

మీతో సాక్షి

సైదాబాద్‌: సాధారణంగా చలికాలంలో సాయంత్రం అవుతుంటేనే చలి బారిన పడకుండా అందరం సవాలక్ష రక్షణ చర్యలు తీసుకుంటాం. కానీ ఇదే చలికాలంలో తెల్లవారుజామున 5గంటలకే గడ్డకట్టే చలిలోనూ రోజూ తప్పనిసరిగా విధులకు హాజరవుతారు పారిశుద్ధ్య కార్మికులు. చలికాలమైనా.. జోరున కురిసే వర్షాకాలమైనా సంవత్సరం పొడువునా వారు విధులకు హాజరు కావాల్సిందే.

- ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా వారు విధులకు హాజరైతేనే నగరం శుభ్రంగా ఉంటుంది. నగంలోని కాలనీలు, బస్తీల్లోని రహదారులు, ప్రధాన వీధులు, రహదారులు అన్నీ శుభ్రంగా ఉంటున్నాయంటే నిత్యం పారిశుద్ధ్య కార్మికులు తమ స్వేదాన్ని చిందిస్తూ ఉండటం వల్లే. అయితే విధి నిర్వహణలో, జీవితంలో ఎన్నో కష్టాలు పడుతున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సైదాబాద్‌లో మీతో సాక్షి కార్యక్రమంలో విధి నిర్వహణలో, నిత్య జీవనంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారు తెలియజేశారు.
- తమకు వీక్లీ హాఫ్‌ ఉన్న రోజు తప్పించి పండుగల రోజుల్లో కూడా విధులకు హాజరు కావాల్సిందే.
- చాలా సందర్భాల్లో తాము ఒక్క రోజు సెలవు తీసుకుంటే రెండు రోజులకు జీతం కట్‌ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రోజూ తమకు కేటాయించిన కాలనీల్లో విధులు నిర్వర్తిస్తూనే అధికారులు ఆదేశిస్తే మరో చోటుకు తమ సొంత డబ్బులతో వెళ్లి పనులు చేయాల్సి వస్తోందన్నారు.
- విధుల్లో ఉన్నప్పుడు అటుగా రాకపోకలు సాగించే వాహనాల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.
- తెల్లవారుజామున 5గంటలకు విధులకు వస్తే మధ్యాహ్నం 2గంటల వరకు ఉండాల్సి వస్తుందన్నారు. దీంతో ఇంట్లో తమ కుటుంబాన్ని చూసుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు.
- ఇంత కష్టం చేసినా తమకు నెలకు కేవలం రూ.15వేలు మాత్రమే జీతంగా ఇస్తున్నారని తెలిపారు.
- తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం జీతం పెంచాలని వారు కోరుతున్నారు.

## బస్తీవాసులకు 'డబుల్‌' ఇళ్లు ఇవ్వాలి



ఎమ్మెల్యే బలాలకు వినతి పత్రం అందజేస్తున్న దాసురావు, చందులాల్‌ నాయక్‌

మలక్‌పేట: తెలంగాణ దళిత గిరిజన సేవా సంఘం నాయకులు శుక్రవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాలను వంజేషాహ క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తీగలగూడ శ్రీశ్రీ బంజారా బస్తీవాసులకు డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లు కేటాయించే విధంగా చూడాలని వినతి పత్రం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బట్టు దాసురావు తెలిపారు. 2021 సంవత్సరంలో సైదాబాద్‌ మండల అధికారులు శ్రీశ్రీబంజారా బస్తీలో సోషల్‌ ఎకానమీ సర్వే(ఎస్‌ఈఎస్‌) నిర్వహించి 131 మందిని అర్హులుగా గుర్తించారన్నారు. నాలుగేళ్లయినా తమకు సొంతింటి కల నెరవేరలేదన్నారు. వెంటనే తమకు డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే బలాల స్పందించి జిల్లా కలెక్టర్‌కు లెటర్‌ రాస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి చందులాల్‌ నాయక్‌, సత్తారపు గోపాల్‌, నర్సింహ ఉన్నారు.

## ఎట్టకేలకు స్పందించారు!



సాక్షి ఎఫెక్ట్‌..

ఎల్‌బీనగర్‌: 'గుంతలమయం ... ప్రమాదలకు నిలయం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ అధికారులు స్పందించారు. బీఎన్‌ రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలలో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చారు. అవసరం ఉన్న చోట నూతన రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

# విద్యార్థులు చదువులో రాణించాలి

నాగోలు: విద్యార్థులు చదువల్లో రాణించాలని జీహెచ్‌ఎంసీ మాజీ వార్డు సభ్యుడు మల్లేపాక యాదగిరి విద్యార్థులకు సూచించారు. కొత్తపేట డివిజన్‌ రాజీవ్‌గాంధీనగర్‌లో బోస్కో సేవా కేంద్రం సీప్‌ ట్యూషన్‌ సెంటర్స్‌లో శుక్రవారం కల్చరల్‌ ఈవెంట్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లేపాక యాదగిరి మాట్లాడుతూ.. బోస్కో సేవా కేంద్రం వారు బస్తీలోని పిల్లలకు ఉచితంగా ట్యూషన్‌ నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువులల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు ఇంట్లో పని చేపకుండా పాఠశాలకు, ట్యూషన్‌ రోజు తప్పకుండా పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామావత్‌ దీప్‌లాల్‌ నాయక్‌, చంద్‌పాషా, శ్యామల, అజయ్‌కుమార్‌, బాలు, సుమతి, వనీత, బోస్కో సేవా కేంద్రం సభ్యులు ఉషా, అనిత, చెన్నమ్మ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ లోక్‌ అదాలత్‌

నాగోలు: చాలా కాలంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్‌ ఇన్‌స్పెక్టర్‌వినోద్‌కుమార్‌ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జరిగే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణాల్లో లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తామన్నారు. క్రిమినల్‌ కేసులతో పాటు రాజీపడదగిన సివిల్‌ కేసులు, భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్‌ఫండ్‌ కేసులు, చెక్‌ బౌన్స్‌కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, అన్ని రకాల ట్రాఫిక్‌ కేసులకు సంబంధించి ఇరువర్గాల కక్షిదారులు అంగీకార యోగ్యమైన సత్వర పరిష్కారం లోక్‌ అదాలత్‌ ద్వారా పొందవచ్చన్నారు. ఇరువర్గాల కక్షిదారులు లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీగురు చరిత్ర పారాయణం



దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం అల్కాపురి శ్రీశృంగేరి శంకరమఠంలోని శ్రీగురు దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన శ్రీగురు చరిత్ర పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీదత్త భావసుధారస స్తోత్రం, కఘో కష్టోద్ధారణ స్తోత్రం, సిద్ధమంగల స్తోత్రం పారాయణం నిర్వహించారు. శృంగేరి శంకర మఠం బ్రాంచ్‌ హెడ్‌ క్రొవ్విడి శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. తనను ఆరాధించే భక్తుల కోసం అనేక రూపాలలో దర్శనమిచ్చే స్వామి దత్తాత్రేయుడని అన్నారు.

**నేడు దత్తాత్రేయ జయంతి వేడుకలు..**

ఆలయంలో శనివారం అష్టోత్తర శత కలశాభిషేకం, గోపూజ, శ్రీగురు దత్తాత్రేయస్వామి వారి మూలమంత్ర హవనం, మహా పూర్ణాహుతి, మంగళ నీరాజనం, స్వామివారి పాదుకా సహస్ర నామార్చన నిర్వహిస్తారని తెలిపారు.

## మతిస్థిమితం సరిగాలేని వ్యక్తి అదృశ్యం



తుషారెడ్డి (ఫైల్‌)

చైతన్యపురి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మతిస్థిమితం సరిగాలేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై కూర శేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం... న్యూ మారుతీనగర్‌ రోడ్‌ నం.3ఈలో నివసించే గురువారెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి తుషారెడ్డి (35)కి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదు. గత నెల 28న తల్లి మమత ఫోన్‌ తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. అయితే తుషారెడ్డి తన తల్లి ఫోన్‌ నుంచి పరిచయం ఉన్న ఇద్దరు యువకులకు నగదు ట్రాన్స్‌ఫర్‌ చేశాడు. తరువాత సెల్‌ ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేశాడు. దీంతో వారం రోజులైనా అతని జాడ తెలియక పోవడంతో కంగారు పడిన తండ్రి గురువారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సెమీ క్రిస్మస్‌ సెలబ్రేషన్స్‌



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్‌ బ్రదర్‌ గద్దం మోజెస్‌

మలక్‌పేట: యేసు క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని మలక్‌పేట హోరేబు చర్చి ఆధ్వర్యంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్‌ సెలబ్రేషన్స్‌, గాస్పెల్‌ మీటింగ్‌ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్తుతి పాటలు పాడుతూ యేసు ప్రభువును ఆరాధించారు. చర్చి పాస్టర్‌ బ్రదర్‌ గద్దం మోజెస్‌ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్రదర్‌ రమేష్‌ యేసుక్రీస్తు జననంపై శుభ సందేశం అందించారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

## శ్రీశైలం యాత్రకు శివ స్వాములు



ఎల్‌బీనగర్‌: శ్రీ మల్లికార్జున భక్త సమాజం అధ్యక్షుడు ముద్దగౌని సతీష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో సుమారు 50మంది శివ స్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలం యాత్రకు బయల్దేరారు. మల్లిఖార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో శివ మాల వేసుకున్న వారికి ఉచితంగా భోజనంతో పాటు కొంత మందికి యాత్రకు తీసుకెళ్లారు.

## యునైటెడ్‌ క్రిస్మస్‌ వేడుకలు



వేడుకలో పాల్గొన్న క్రిస్టియన్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు

వనస్థలిపురం: హయత్‌నగర్‌ మండల క్రిస్టియన్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని క్రైస్ట్‌ గాస్పల్‌ చర్చిలో గురువారం రాత్రి యునైటెడ్‌ క్రిస్మస్‌ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్‌ ఎజ్రా క్రిస్మస్‌ సందేశాన్ని వినిపించారు. అనంతరం కేక్‌ను కట్‌ చేసి క్రిస్మస్‌ శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్‌ అధ్యక్షుడు పాస్టర్‌ సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి పాస్టర్‌ కిషోర్‌బాబు, పలువురు పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

### నేటి నుంచి శ్రీదత్తాత్రేయ జయంతి మహోత్సవాలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో శనివారం నుంచి బుధవారం వరకు శ్రీదత్తాత్రేయ జయంతి మహోత్సవాలు ఉంటాయని ఆలయ చైర్మన్‌ బీవీ శ్యామ్‌కుమార్‌ తెలిపారు. శ్రీసాయిబాబా వారి 72గంటల సమాధి ఘట్టం – శ్రీసాయినాథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని కోరారు.



## గీతా మహత్యంపై ప్రత్యేక కార్యక్రమం నేడు

మన్సూరాబాద్‌: భక్తి కుటీర్‌ వనస్థలిపురం ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌ డివిజన్‌ పరిధి పద్మావతినగర్‌ కమ్యూనిటీహాల్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు గీత మహత్యంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి తెలిపారు. శ్రీమాన్‌ ప్రణవానంద ప్రభూజీ గీత మహత్యంపై వివరించనున్నట్లు స్పష్టం చేశారు. సమీప కాలనీలవాసులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఇదేనా స్వచ్ఛత.?

ప్రచారం ఘనం.. ఆచరణలో నిర్లక్ష్యం



న్యూ దిల్‌సుఖ్‌నగర్‌ సంక్షేమ సంఘ భవనం ఎదుట చెట్ల కొమ్మలు



హనుమాన్‌నగర్‌ రహదారి పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు



సత్యనారాయణపురం కాలనీలో నెల రోజులుగా పేరుకుపోయిన చెట్ల కొమ్మలు




సాయినగర్‌లో వాసవీ హోమ్స్‌ ఎదుట మట్టి, కంకర కుప్పలు

- చైతన్యపురి డివిజన్‌లో కానరాని స్వచ్ఛత
- గతంలో స్వచ్ఛ డివిజన్‌గా అవార్డు
- నేడు ఎటు చూసినా చెట్లకొమ్మలు, వ్యర్థాలు

చైతన్యపురి: స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం... చెత్త డంపింగ్‌ బిన్స్‌ లేకుండా చేస్తాం.. స్వచ్ఛ హైదరాబాదే లక్ష్యం... పచ్చదనం పరిశుభ్రత మన బాధ్యత... అంటూ మంచి మంచి మాటలు నిత్యం జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల నోట వింటుంటాం. ఎక్కడ ఏ కార్యక్రమాల్లో పాల్గొన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛతపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. కానీ క్షేత్రస్థాయిలో చూస్తే వారి ప్రకటనలకు విరుద్ధంగా మనకి ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు, అపరిశుభ్ర రోడ్లు, కొట్టి పడేసిన చెట్ల కొమ్ము, దుర్గంధ ఉండే కాలనీలు తయారయ్యాయి.

– చైతన్యపురి డివజన్‌కు ఓ స్వచ్ఛంద సంస్థ స్వచ్ఛ డివిజన్‌గా గతంలో ప్రకటించింది. అవార్డు కూడా తీసుకున్నారు. కానీ నేడు పరిస్థితి చూస్తే ఘోరంగా మారింది. సత్యనారాయణపురం, హనుమాన్‌నగర్‌, ప్రభాత్‌నగర్‌, సాయినగర్‌, న్యూదిల్‌సుఖ్‌నగర్‌ తదితర కాలనీలలో ఏ రహదారి చూసినా మనకు విద్యుత్‌ సిబ్బంది కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు కనిపిస్తున్నాయి. ఇళ్ల యజమానులు కుప్పలుగా పోసిన మట్టికుప్పలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**రహదారుల వెంట నడవటం కష్టంగా ఉంది...**



కాలనీలలో రోడ్లపై చెత్త కుప్పలు, చెట్ల కొమ్మలు నెలల తరబడి ఉంటున్నాయి. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షాకాలంలో మరింత ఇబ్బందిగా ఉంది. దుర్వాసనే కాక దోమలు కూడా విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

– సత్యనారాయణ గుప్తా, సత్యనారాయణపురం కాలనీ